# సామాజిక విప్లవకారుడు గద్దర్


కాజీపేట జంక్షన్‌లో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైల్వే జేఏసీ నాయకులు


హన్మకొండ: బీఆర్‌ఎస్ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


ఖిలా వరంగల్: పడమర కోటలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

**కాజీపేట రూరల్:** సామాజిక విప్లవ ప్రజా గొంతుక ప్రజాయుద్ధ నౌక, ప్రజా గాయకుడు గద్దర్ అని తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు కొనియాడారు. గద్దర్ జయంతిని కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రైల్వే జేఏసీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమాయక ప్రజల మేలుకొలుపు కోసం విప్లవ రచనలు, గీతాలు రచించారని, గానంతో తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కాజీపేట డివిజన్ కోసం 2007లో కడిపికొండ బ్రిడ్జి నుంచి వరంగల్ అజం జాహి మిల్ వరకు పాదయాత్ర చేసి మిల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగింపు సభలో గద్దర్ మాట్లాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు గాజుల గోవర్ధన్, సాంబయ్య, రైల్వే ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, నాయకులు ఎస్‌ఆర్ వీ.రావు, ఎంకే.మూర్తి, భాస్కర్, దేవదాసు, సంగమయ్య, రమేష్, ఎస్.హరిబాబు, సారయ్య, సాయిరాజ్, యబ్నెజర్, లక్ష్మినారాయణ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

**పీడిత వర్గాల ప్రజా గొంతుక**

**హన్మకొండ:** పీడిత వర్గాల ప్రజా గొంతుక గద్దర్ అని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో గద్దర్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు జోరిక రమేష్, పులి రజనీకాంత్ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పాటని పోరుబాటగా మలుచుకుని పోరాడిన పోరాట యోధుడు గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన పోరాటంలో గద్దర్ పాటకు ప్రముఖ స్థానం ఉందని గుర్తుచేశారు. నాయకులు కొడకండ్ల సదాంత్, వెన్నె కోటేశ్వరరావు, పోలపల్లి రామ్మూర్తి, సురాసి మహేష్, ఇజ్జగిరి భీమ్‌రాజ్, మాలకుమ్మరి పరశురాములు, మంద చంటి, మైదం కరుణాకర్, గొర్రె అరుణ్, బిసుపాక శివ, రిపిక రాజ్‌కుమార్, మాదాసి వసంత్, రంజిత్ పాల్గొన్నారు.

**ఖిలా వరంగల్ పడమర కోటలో..**

**ఖిలా వరంగల్:** ప్రజా యుద్ధనౌక, విప్లవ గాయకుడు గద్దర్ జయంతి వేడుకలను పడమర కోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ సంఘం, కార్మిక సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ఐత అనిల్, సుద్దాల నాగరాజు, మైదం రవన్న, డైమస్ బాబు, దర్శనాల సుభాష్, బరిగెల రాజేందర్, రవి యాదవ్, అక్బర్, నలిగంటి బొబ్బిలి, గద్దల ప్రసాద్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ:** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఫిబ్రవరి 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. పింజర్ల, ఏనుగుల గడ్డ, రాగన్న దర్వాజ, రాయపుర, బ్రాహ్మణవాడ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### రక్తదానంలో ముందుండాలి



**వరంగల్ స్పోర్ట్స్:** రక్తదానం చేసేందుకు యువత ముందుండాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి సూచించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం హనుమకొండలోని రామప్ప పోలీస్ అకాడమీలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అకాడమీలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న 56మంది అభ్యర్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన రామప్ప అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెద్ది వెంకటనారాయణ గౌడ్, ఐలి వంశీకృష్ణ, సంతోష్‌రావు పాల్గొన్నారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

**మడికొండ:** డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి 2రోజులపాటు జైలుశిక్ష విధించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ గుజ్జేటి వేణు తెలిపారు. మడికొండ చౌరస్తాలో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన మడికొండ గ్రామానికి చెందిన వ్యక్తిని న్యాయమూర్తి విద్యాసాగర్‌రావు ఎదుట ప్రవేశపెట్టగా జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ వివరించారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

**విద్యారణ్యపురి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయా జిల్లాల పరిధిలోని పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చాంప్లనాయక్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్దుల్ ఘని కోరారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనైనా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### 5న క్రిస్టియన్ జేఏసీ సదస్సు



**వరంగల్ చౌరస్తా:** హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఈనెల 5న జరగనున్న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ చెరుకూరి రత్నరాజ్ కోరారు. ఈమేరకు వరంగల్ రామన్నపేటలో సదస్సు పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రత్నరాజ్ మాట్లాడుతూ క్రిస్టియన్లకు గత ప్రభుత్వం మొండిచేయి చూపిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రైస్తవులకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర కోచైర్మన్ మేకల సారయ్య, జన్ను ప్రభాకర్, రాష్ట్ర నాయకులు రేవ ఇర్మియ, జాషువా జాన్, జాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### పాలకవర్గానికి సన్మానం

**హసన్‌పర్తి:** పంచాయతీ పాలకవర్గ కాలపరిమితి బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీల్లో పాలకవర్గ సభ్యులను సన్మానించారు. హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపురం, మడిపల్లి, జయగిరి, సీతంపేట, గంటూరుపల్లి, పెంబర్తి, సూదన్‌పల్లి, నాగారం, సీతానాగారం, బైరాన్‌పల్లి, అర్వపల్లి, హరిశ్చంద్రనాయక్ తండా, మల్లారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధాపురంలో జరిగిన కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ సర్పంచ్‌ల సహకారంతో ఆయా గ్రామాల్లో లక్షలాది రూపాయల పనులు చేపట్టినట్లు వివరించారు. సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాలతి, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### ప్రశాంతతకు నిలయాలు



**కాజీపేట అర్బన్:** మానసిక ప్రశాంతతకు నిలయాలుగా దేవాలయాలు నిలుస్తాయని త్రిదండి రామచంద్ర జీయర్‌స్వామి తెలిపారు. 31వ డివిజన్‌లోని త్రివేదాద్రి సంతోష లక్ష్మి నరసింహస్వామి దోనెగుట్టను ఆయన బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కార్యక్రమంలో పూర్ణ కుంభంతో స్వామికి గ్రంధి సూర్యనారాయణ స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోదండరాంను అడ్డుకోవడం సరికాదు


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సంగని మల్లేశ్వర్, తదితరులు

**కేయూ క్యాంపస్:** రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాంను శాసనమండలిలోకి అడుగు పెట్టనీయకుండా అడ్డుకోవడం సరికాదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన ఉద్యమ నేత కోదండరాం నియామకాన్ని అడ్డుకునే కుట్రలను వ్యతిరేకిస్తూ పాస్ ఆధ్వర్యంలో కేయూ క్యాంపస్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్ మాట్లాడుతూ గవర్నర్ కోటాలో నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవీ భర్తీ మొదటి నుంచి వివాదాలకు దారితీసేందుకు కారణం బీఆర్‌ఎస్ పార్టీ వైఖరే కారణమని విమర్శించారు. పాస్ కార్యదర్శి డాక్టర్ శివనాగయ్య, డాక్టర్ శంకర్, వెంకన్న, శివకృష్ణ, సాయిప్రమోద్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌ది కుటిల నీతి**

**హన్మకొండ:** ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయనీయకుండా అడ్డుకోవడం బీఆర్‌ఎస్ పార్టీ కుటిల నీతికి, అనైతిక, విషపూరిత రాజకీయ క్రీడకు నిలువెత్తు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ రాగమళ్ల పరమేశ్వర్ విమర్శించారు. ఇలాంటి నీచమైన చర్యను తెలంగాణ సమాజం క్షమించదని ఒక ప్రకటనలో తెలిపారు.

# రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

**ఖిలా వరంగల్:** జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆర్టీఓ రంగారావు ఆధ్వర్యంలో రహదారి భద్రతపై బుధవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే గురుకులంలో ఎంవీఐ కోల రవీందర్, రమేష్‌రాథోడ్ పర్యవేక్షణలో రహదారి భద్రతపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ రంగారావు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన పెంచుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. ఏకాగ్రతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ వాడి ప్రమాదాల బారినుంచి రక్షణ పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, ఏఎంవీలు శాలిని, స్వర్ణలత, డీబీఏ శ్రీధర్‌రెడ్డి, హోం గార్డులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లైబ్రరీ సైన్స్ విభాగంలో ఫ్రెష్ ఫ్లేర్‌ఫెస్ట్


ఫ్రెష్ ఫ్లేర్‌ఫెస్ట్‌లో అసోసియేషన్ బాధ్యులు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఫ్రెష్ ఫ్లేర్‌ఫెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో పీహెచ్‌డీ సాధించిన అనిల్‌కుమార్, రమేష్‌ను సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఇద్దరిని, నెట్‌లో నెగ్గిన వారిని అభినందించారు. ఎంఎల్‌ఐఎస్సీలో మొదటి ర్యాంకు సాధించి గోల్డ్‌మెడల్ అందుకున్న అఖిలకు ప్రోత్సాహక బహుమతిగా వెంపటి లక్ష్మి నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు, లక్ష్మినారాయణ బాల్యమిత్రబృందం సభ్యులు మరో రూ.10 వేలను ట్రస్టు కన్వీనర్ డాక్టర్ కోలాహలం రాంకిషోర్ అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలంటే భయం వద్దు

**కాశోజీ సెంటర్ :** పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై ఆందోళన, భయాన్ని వీడాలని వరంగల్ డీఈఓ వాసంతి సూచించారు. విద్యార్థులకు పరీక్షలపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఆమె బుధవారం పరిశీలించారు. జిల్లా పరిషత్, టీఎస్‌ఎంఎస్, కేజీబీవీ, టీడబ్ల్యూఆర్‌ఎస్, ఎయిడెడ్ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 4,233 మంది విద్యార్థులకు 15 బృందాల విషయ నిపుణులతో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం జీహెచ్‌ఎస్ కరీమాబాద్, జీహెచ్‌ఎస్ మట్టెవాడ, ధర్మారం జెడ్పీహెచ్‌ఎస్, జెడ్పీహెచ్‌ఎస్ దుగ్గొండిని డీఈఓ పర్యవేక్షించి మాట్లాడారు. డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఎంఈఓ విజయ్‌కుమార్, నోడల్ అధికారులు గంప అశోక్, బి.ప్రసాద్, ఎస్.రవీందర్, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు మాధవి, అరుణ, సాంబయ్య, రామస్వామి పాల్గొన్నారు.

## మార్కెట్‌లో కూలీల ఆందోళన



**వరంగల్:** ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం ఎదుట మహిళా కూలీల బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు వెళ్తుండగా సెక్యూరిటీ గార్డులు అనుమతించడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా యార్డుల్లో బస్తాల్లో ఉన్న మిర్చిని తీస్తున్నారనే రైతుల ఆరోపణ మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# స్టెమ్ స్పార్క్‌కు గురుకులం విద్యార్థులు


ప్రాజెక్టుతో విద్యార్థులు, గైడ్

**మడికొండ:** జాతీయ స్థాయి స్టెమ్ స్పార్క్‌కు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్ 2023-24లో ఫూట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టం ప్రాజెక్ట్‌ను పాఠశాల పదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించి మొదటి 5వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మల్లారెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టును ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో బెంగుళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరగనున్న జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు గైడ్ ఉపాధ్యాయురాలు కే.జ్యోతి, విద్యార్థులు ఆర్.శృతి, ఎల్.రమ్యను రీజనల్ కోఆర్డినేటర్ విద్యారాణి, తదితరులు అభినందించారు.

# నగరాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం


ఐడీ కార్డు అందజేస్తున్న సీపీ, జర్నలిస్టులు

**నయీంనగర్:** విధి నిర్వహణలో ఉండే వర్కింగ్ జర్నలిస్టులకు పోలీస్ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, మైసూర్‌లాంటి నగరాలతో సమానంగా గ్రేటర్ వరంగల్ నగరం అభివృద్ధి చెందాలంటే జర్నలిస్టులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీ హాజరై సీనియర్ సభ్యులకు ఐడీ కార్డులు అందజేసి మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ సభ్యుల ప్రాథమిక సమాచారంతో, డూప్లికేట్ చేయడానికి వీలు లేని హైటెక్ ఐడీకార్డులు సభ్యులకు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు దాసరి కృష్ణారెడ్డి, బీఆర్.లెనిన్, తోట సుధాకర్, మెండు రవీందర్, మట్టా దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# దర్గా ఉర్సును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పీఠాధిపతి

**కరీమాబాద్:** ఉర్సు దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని పీఠాధిపతి సయ్యద్ మొహినొద్దీన్ అహ్మద్ ఖుబ్యార్ ఖాద్రీ (హసీబ్‌పాషా) కోరారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉర్సులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు 468వ ఉర్సు దర్గా (హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షా జమాలుల్ బహర్), (సయ్యదనా మాషుక్ రబ్బానీ) ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. దేశ నలుమూలల నుంచి ప్రజలు తరలివస్తారని చెప్పారు. ఉత్సవాలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సయ్యద్ జమాలుద్దీన్ అహ్మద్ ఖాద్రీ, సయ్యద్ మొహినొద్దీన్, మత పెద్దలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

**ఎంజీఎం:** ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే టీఎన్జీవోస్ యూనియన్ అనునిత్యం కృషి చేస్తోందని టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాల నూతన యూనిట్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేఎంసీ యూనిట్ అధ్యక్షుడిగా పి.సురేందర్, కార్యదర్శిగా అబ్దుల్ వాహబ్, కోశాధికారిగా వెంకటేశ్వర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీలతతిరుపతి, మనోజ్, సంయుక్త కార్యదర్శులుగా రమాదేవి, పావని, ముజాఫర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఐనవోలు యూనిట్ అధ్యక్షుడు నవీన్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శ్యాంసుందర్, రాము నాయక్, లక్ష్మిప్రసాద్, జిల్లా నాయకులు రాజేష్ ఖన్నా, మల్లేశం, మోహబూబ్, సుధాకర్ పాల్గొన్నారు.

# ట్రైన్ మేనేజర్ కుమారస్వామికి సన్మానం


జ్ఞాపిక అందజేస్తున్న సత్యనారాయణ, నాయకులు

**కాజీపేట రూరల్:** భారతీయ రైల్వేలో 32ఏళ్లపాటు గ్యాంగ్‌మెన్ నుంచి ట్రైన్ మేనేజర్ స్థాయి వరకు విజయవంతంగా విధులు నిర్వర్తించి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన మేకల కుమారస్వామిని రైల్వే నాయకులు సన్మానించారు. కాజీపేట రైల్వే సేఫ్టీ సెమినార్ హాల్‌లో కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి కుమారస్వామిని అభినందించారు. రైల్వే సంఘ్ హెడ్‌క్వార్టర్ బ్రాంచీ సెక్రటరీ ముస్తాక్ హుస్సేన్, చైర్మన్ నర్సింగరావు, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అగ్గి రవీందర్ మాట్లాడుతూ రైల్వేలో అంకితభావంతో పనిచేసి అధికారుల నుంచి అనేక పురస్కారాలు అందుకున్న కుమారస్వామి.. ఈ తరం వారికి ఆదర్శనీయమని సూచించారు. కార్యక్రమంలో సంఘ్ వర్కింగ్ చైర్మన్ గుత్తికొండ నారాయణ, నాయకులు విద్యాసాగర్, కేఎస్.రావు, హనుమంతరావు, రవికాంత్, యాకాంబ్రం, ఎల్లయ్య, సలీం, రాములు, మధు, నవీన్, సాంబమూర్తి, రాజయ్య, యాకయ్య, బాషుమియా, బాబురావు, కన్నయ్య, కనకయ్య, సదానందం, శ్రీనివాస్, ఈశ్వర్, సమ్మయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'పోలీస్ ఉద్యోగుల'కు సన్మానం


ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో ఉచిత కోచింగ్ పొందిన పలువురు అభ్యర్థులు.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ చూపారని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నాగయ్య తెలిపారు. ఈమేరకు 69మంది కానిస్టేబుళ్లుగా, ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికయ్యారని వివరించారు. వారిలో కొంతమందిని కేయూలోని ఫిజిక్స్ సెమినార్‌హాల్‌లో బుధవారం సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ మాట్లాడుతూ పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉంటూ సమాజానికి ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలని సూచించారు. ఫిజిక్స్ విభాగం అధిపతి శ్రీలత, ప్రొఫెసర్ మంజుల, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ ఆశీర్వాదం, హిమబిందు, భవాని, మానస, రాకేష్, తేజస్విని, సందీప్, రమ్య, గణేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**కరీమాబాద్:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ సూచించారు. వరంగల్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు వివిధ విభాగాలకు సంబంధించి క్రీడాపోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావంతోపాటు పట్టుదల కూడా పెరుగుతుందని చెప్పారు. ఆటలు మానసికోల్లాసంతోపాటు దేహదారుఢ్యానికి ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిన వారు నిరుత్సాహపడకుండా గెలిచేందుకు మరోసారి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్లు డాక్టర్ వరుణ్, వైష్ణవి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ, ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

### కేయూలోని సమస్యలు పరిష్కరించాలి

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలోని సమస్యలను పరిష్కరించాలని కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, కోశాధికారి ప్రొఫెసర్ వీరన్ననాయక్ కోరారు. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా విద్యారంగం విధ్వంసం అయిందని తెలిపారు. తెలంగాణలోని ఉన్నత విద్య, యూనివర్సిటీల్లోని సమస్యలు, భవిష్యత్తు ప్రణాళికపై రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి రెండోవారంలో కాకతీయ యూనివర్సిటీలో సెమినార్ నిర్వహించబోతున్నట్లు చెప్పారు. సెమినార్‌కు రావాలని వెంకటేశంను ఆహ్వానించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

### డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

**హసన్‌పర్తి:** డ్రాయింగ్ పోటీల్లో హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ విద్యార్థి ఆకుతోట హరిచందన ప్రతిభ కనబరిచింది. ఈమేరకు 1,116 నగదుతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకుంది. వేద విజ్ఞాన సమితి, హైదరాబాద్ ఆధ్వర్యంలో అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలో హరిచందన పాల్గొని ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. అలాగే, పాఠశాలకు చెందిన ఆకుతోట లక్ష్మీచందన.. ప్రోత్సాహక బహుమతి అందుకున్నట్లు వివరించారు.

### విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

**ఖిలా వరంగల్:** ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని చాణిక్య విద్యానికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ వినోద్‌కుమార్, వడుప్సా ప్రతినిధి ఆడెపు శ్యాంసుందర్ సూచించారు. వరంగల్ విద్యానగర్ కాలనీలోని చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ముక్కెర రవీందర్ అధ్యక్షతన వడుప్సా ఖిలా వరగల్ జోన్ ప్రతినిధుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలతోనే పాఠశాలలకు పేరు ప్రతిష్టతలు పెరుగుతాయని వివరించారు. యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామం చేయిస్తే విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. అనంతరం, 2023, సెప్టెంబర్ 5న కలెక్టర్ నుంచి అవార్డులు పొందిన ఉపాధ్యాయులు బండి చక్రపాణి, అంగపాటి రాజు, శ్రీనివాస్‌ను సన్మానించారు. సమావేశంలో వడుప్సా ప్రతినిధులు దాస్యం సతీష్‌మూర్తి, సుధీర్, శ్రీధర్, బిల్లా రవి, వీరస్వామి, వెంకన్న, క్రాంతి, శ్రీను, అవినాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**మడికొండ:** కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను మడికొండలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు సట్ల నరసింహ, బండి సురేష్‌గౌడ్, మడికొండ గ్రామశాఖ అధ్యక్షుడు బుర్ర రాజేందర్‌గౌడ్, డైరెక్టర్లు బుర్ర సతీష్‌గౌడ్, మాచర్ల రాజ్‌కుమార్, మోడెం సతీష్, బొల్లికొండ సంపత్, తండ అఖిల్, మాచర్ల స్వామి, గీత కార్మికులు పాల్గొన్నారు.

### భద్రకాళి దేవాలయానికి వీల్‌చైర్ అందజేత

**హన్మకొండ కల్చరల్:** భద్రకాళి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా వృద్ధుల సౌకర్యార్థం వీల్‌చైర్‌ను జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ బహూకరించారు. ఈమేరకు దేవాలయ ఈఓ శేషుభారతికి బుధవారం అందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యుడు మలహల్‌రావు, జిల్లా సంక్షేమశాఖ సూపరింటెండెంట్ లక్ష్మీకాంతరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బీఎస్పీ వర్ధన్నపేట ఇన్‌చార్జ్‌గా వేణుగోపాల్



**హసన్‌పర్తి:** బీఎస్పీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన చాతళ్ల వేణగోపాల్ నియతులయ్యారు. ఈమేరకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యాంసుందర్ బుధవారం ప్రకటించారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు అభినందన


లక్ష్మీప్రియను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

**కాజీపేట రూరల్:** రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపతిముర్ము నుంచి అందుకున్న కాజీపేట ఫాతిమానగర్ మాంట్‌ఫోర్టు పాఠశాల విద్యార్థి పెండ్యాల లక్ష్మీప్రియను పాఠశాలలో బుధవారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో బాలపురస్కార్‌ను రాష్ట్రపతి నుంచి లక్ష్మీప్రియ అందుకుంది. అలాగే, సెయింట్ బాయ్స్ మౌంట్‌ఫోర్టు 351వ వార్షికోత్సవాన్ని బుధవారం జరిగాయి. కార్యక్రమంలో మాంట్‌ఫోర్టు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ విన్సెంట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దపెడ్డో, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.